సగటుజీవిపై గ్యాస్ గుదిబండ



- మళ్లీ గ్యాస్ ధరల పెంపు
- ఐదేళ్లలో ధర రెట్టింపు
- నియోజకవర్గంలో ఏడాదికి రూ.4 కోట్ల అదనపు భారం

ఎమ్మిగనూరు: కేంద్ర ప్రభుత్వ విధానాలు సగటు మనిషికి చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే చమురు రేట్లు అమాంతం పెంచేసి వాహన చోదకుల చమురు వదిలిస్తున్న కేంద్రం మళ్లీ వంట గ్యాస్ ధరలను పెంచింది. గృహ వినియోగదారులకు సిలిండర్‌పై రూ.50, కమర్షియల్ వినియోగదారులకు సిలిండర్‌పై రూ.250 పెంచేసింది. బుధవారం అర్ధరాత్రి నుంచే పెంచిన ధరలు అమల్లోకి రావటంతో సగటు జీవిపై గ్యాస్ గుదిబండ పడింది.

సామన్యులకు సవాల్

సామన్య ప్రజలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షగట్టిందా అన్నట్లు చమురు ధరలను అమాంతం పెంచుకుంటూ పోతోంది. ఇప్పటికే పెంచిన డీజిల్, పెట్రోల్ ధరలతో సామాన్యుల జీవనం అతలాకుతలమైంది. పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలతో ప్రత్యక్షంగా నిత్యవసర ధరలు, ట్రాన్స్‌పోర్టు రంగాలపై తీవ్ర ప్రభావం చూపింది. మూడేళ్ల పాటు కోవిడ్ కష్టాలతో బతుకుజీవుడా అంటూ కాలం గడుపుతున్న ప్రజలపై, వ్యాపార రంగాలపై చమురు ధరలు మరింత ప్రభావం చూపసాగాయి. అదీ చాలదన్నట్లు ఎల్‌పీజీ (గ్యాస్ సిలిండర్) ధరలు పెంచి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ సామెతను తలపిస్తూ సామాన్యులపై గుదిబండ మోపింది.

ఐదేళ్లలో రెట్టింపైన ధర

పెరిగిన ధరల ప్రకారం గురువారం నుంచి రాష్ట్రంలో గ్యాస్ సిలిండర్ ధరల్లో మార్పులొచ్చాయి. గృహ వినియోగదారుల (డొమెస్టిక్)కు సిలిండర్‌పై రూ.50 పెంచటంతో ధర రూ.1169.50కు చేరింది. అదే కమర్షియల్ వినియోగదారులకు సిలిండర్‌పై రూ.250 పెంచడంతో ధర రూ.2290.50కు చేరింది. 2018లో డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.586, కమర్షియల్ సిలెండర్ ధర రూ.1080 ఉండగా ఐదేళ్లలో ధరలు రెట్టింపయ్యాయి.

ఏటా రూ.4 కోట్లు అదనపు భారం

నియోజకవర్గంలోని నందవరం, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ, ఎమ్మిగనూరు, నందవరం మండలాల్లో హెచ్‌పీ, ఇండేన్, భారత్ గ్యాస్ ఏజెన్సీల ద్వారా గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తారు. నియోజకవర్గం మొత్తం గృహ వినియోగదారుల (డొమెస్టిక్) సర్వీసులు 63,589 ఉన్నాయి. కమర్షియల్ సర్వీసులు 698 ఉన్నాయి. గృహ వినియోగ సర్వీసులపై రూ.50 పెరగటంతో నెలకు రూ.31,79,450 భారం పడింది. అంటే ఏడాదికి రూ.3,81,53,400. కమర్షియల్ వినియోగ సర్వీసులపై రూ.250 పెంచటంతో నెలకు రూ.1,74,500 భారం పడింది. అదే యేడాదికి రూ.రూ.20.94 లక్షలు అదనపు భారం కానుంది. మొత్తం మీద ఎమ్మిగనూరు నియోజకవర్గంలోనే పెరిగిన గ్యాస్ ధరలతో ప్రజలపై ఏడాదికి రూ.4 కోట్లకు పైగా అదనపు భారం పడతుంది. కేంద్ర ప్రభుత్వ తీరుతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. ఫలితంగా వివిధ రకాల నిత్యావసర ధరలు, డొమెస్టిక్ వస్తువులు పెరిగే అవకాశం ఉందంటూ ప్రజల్లో ఆందోళనలు నెలకొన్నాయి.

ఎమ్మిగనూరులో వివిధ ఏజెన్సీల గ్యాస్ సర్వీసులు

ఏజెన్సీ	గృహ వినియోగదారులు	కమర్షియల్ సర్వీసులు
హెచ్‌పీ	38,179	530
భారత్	16,230	148
ఇండేన్	9,175	20
మొత్తం	63,584	698

వంట గ్యాస్ ధర తగ్గించాలి


పత్తికొండలో గ్యాస్ సిలిండర్‌కు పాడె కట్టి నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పత్తికొండ రూరల్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలని కోరుతూ సీపీఐ నాయకులు గురువారం వినూత్న నిరసన చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ ఆధ్వర్యంలో గ్యాస్ సిలిండర్‌ను పాడెపై మోస్తూ సీపీఐ కార్యాలయం నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలతో పేదలపై భారం పడుతుంటే అదనంగా గ్యాస్ బండ బాదుడు తగదన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుదాస్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు సురేంద్ర, నాయకులు కారన్న, తిమ్మయ్య, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సామాన్యులు ఎలా బతకాలి



కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచడం బాధాకరం. సామాన్య ప్రజలు బతికే రోజులు కావివి. ఐదేళ్లలో వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.500 కుపైగా పెరిగింది. మగ్గంతో మాలాంటి వారికి మరింత కష్టమవుతోంది.
– జ్యోతి, గృహిణి, నందవరం

కేంద్రం తీరు సరికాదు



మూడేళ్లపాటు కరోనాతో హోటల్ వ్యాపారాలు జరగలేదు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల చమురు ధరలు పెంచడంతో నిత్యావసర వస్తువుల ధరలు చాలా పెరిగాయి. ఇప్పుడేమో వాణిజ్య సిలిండర్‌పై ఏకంగా రూ.250 పెంచారు. ఫుట్‌పాత్‌పై హోటల్ వ్యాపారాలు చేసుకునే వారికి చాలా కష్టం. – శ్రీనివాసులు, హోటల్ నిర్వాహకుడు, గోనెగండ్ల

ఆలస్యమైందని ఉపాధి కూలీలు వెనక్కి..


ఇళ్లకు వెళుతున్న ఉపాధి కూలీలు

హొళగుంద: పనికి ఆలస్యంగా వచ్చారని ఆగ్రహించిన ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి కూలీలను ఇంటికి పంపించిన సంఘటన గురువారం గజ్జహళ్లిలో చోటు చేసుకోంది. కూలీల కథనం మేరకు.. గజ్జహళ్లికి చెందిన దాదాపు 120 మంది కూలీలు గురువారం ఉపాధి హామీ పథకం పనులకు వెళ్లారు. కూలీలు ఆలస్యంగా వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఫీల్డ్ అసిస్టెంట్ రంజాన్ వారిని ఇంటికి పంపారు. ఇదే విషయంపై మండల మీట్‌లో ఎంపీటీసీ కెంచప్ప ఉపాధి హామి సిబ్బందిని నిలదీశారు. ఘటనపై ఏపీఓ శ్రీనివాసులును విచారించగా సదరు కూలీలు రోజూ పనికి ఆలస్యంగా వస్తున్నారని ఇలా అయితే పనికి రావొద్దని మందలించడంతో వారు ఇంటికి వెళ్లిపోయినట్లు చెప్పారు. ఫీల్డ్ అసిస్టంట్ వివరణకోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

పిచ్చికుక్క స్వైర విహారం

- వైద్యుడికి గాయాలు

పత్తికొండ రూరల్: పట్టణంలోని ప్రధాన రోడ్డులో గురువారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కోర్టు ఆవరణలోకి వెళ్లి న్యాయవాదులు, కోర్టు సిబ్బందిని కరిచేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి తరిమేశారు. పక్కన కాలనీలో ఉన్న ప్రైవేటు వైద్యుడు డాక్టర్ సుబ్రమణ్యంపై దాడి చేసింది. వెంటనే అప్రమత్తమైన చుట్టుపక్కల వారు కుక్కను అక్కడి నుంచి తరిమేశారు. పత్తికొండలో కుక్కల నియంత్రణకు గ్రామపంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

భవిష్యత్తు ఐటీ రంగానిదే


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఐటీ రంగ నిపుణుడు కుమారస్వామి

ఎమ్మిగనూరుటౌన్: భవిష్యత్తు ఐటీ రంగానిదే అని, విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్ బాష, లండన్‌లో స్థిరపడ్డ ఐటీ రంగ నిపుణుడు కుమారస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక కళాశాలలో ఐటీ విభాగంలో ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం నడుస్తున్నదంతా సాంకేతిక విప్లవమన్నారు. అందుకు అనుగుణంగా సాఫ్ట్ స్కిల్స్, కమ్యునికేషన్ స్కిల్స్‌ను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. జావా, పైతాన్, హెచ్‌టీఎంఐ మొదలైన ప్రోగ్రాం లాంగ్వేజెస్‌లో నైపుణ్యాలు పెంచుకోవడంపై మెలకువలు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సుశీలమ్మ, అధ్యాపకులు నాగప్రదీప్, మనోరంజన్, సూపరింటెండెంట్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన బి.శిరీషను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

కృష్ణగిరి: అమకతాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న బి.శిరిష జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పార్థసారథి గురువారం తెలిపారు. గత ఫిబ్రవరి 27 నుంచి ఈ నెల 1 వరకు చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన 66వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాలికల అండర్–14 విభాగం కబడ్డీ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జట్టు మొదటి స్థానం సాధించి కప్పు కైవసం చేసుకుంది. ఈ జట్టులో శిరీష ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన వెల్లడించారు. క్రీడాకారిణి శిరీష, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ శేఖర్‌ను ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

పరీక్షలపై భయం వీడాలి


తుగ్గలిలో మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ వేణుగోపాల్

తుగ్గలి: విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని ఎస్‌ఎస్‌ఏ ఏపీసీ వేణుగోపాల్ సూచించారు. గురువారం తుగ్గలి జెడ్పీ ఉన్నత, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పాఠ్యాంశాల్లోని సందేహాలను ఉపాధ్యాయుల ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. స్టడీ అవర్స్‌లో నిర్వహించే పరీక్షలతో విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెంపొందుతుందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అలెస్కో, కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ

వెల్దుర్తి: మండలంలోని పెట్రోల్ బంక్‌లను తహసీల్దార్ రాజేశ్వరి గురువారం తనిఖీ చేశారు. పట్టణ పరిధిలోని డోన్ రోడ్, రామళ్లకోట రోడ్, హైవే, అల్లుగుండు, రామళ్లకోట పెట్రోల్ బంక్‌లను పరిశీలించిన తహసీల్దార్ ఆయా బంక్‌లలో నిబంధనల మేరకు ఉండాల్సిన సౌకర్యాలను, పెట్రోల్, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. రికార్డులు, ధరల పట్టి తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ పెట్రోల్ బంక్‌ల అసౌకర్యాలు, నాణ్యత, పరిమాణం తదితర వాటిపై 1970 నంబరుకు లేదా స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. వీఆర్‌ఓ ఆనంద్, వీఆర్‌ఏలు ఉన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

నందవరం: టి.సోమలగూడూరులో పెద్దమ్మ, మారెమ్మవ్వ దేవర సందర్భంగా గురువారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశ్వర రెడ్డి పోటీలను ప్రారంభించారు. మొదటి స్థానంలో మహేష్ ఎద్దులు నిలిచి రూ.20,016 నగదు కైవసం చేసుకున్నాయి. రెండో స్థానంలో నిలిచిన గోరంట్ల వృషభాలు రూ.15,016, మూడో స్థానంలో అదే గ్రామానికి చెందిన సోమన్న ఎద్దు నిలిచి రూ.10,016 గెలుపొందాయి. నాల్గవ స్థానంలో నాగరాజు ఎద్దు నిలిచి రూ.5,016 గెలుపొందాయి. దాతలు వెంకటేశ్వర్‌రెడ్డి, బాలముని, నరసింహులు, మోహన్‌రెడ్డి, సోమన్న చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

చంద్రబాబుది ముగిసిన చరిత్ర


సచివాలయ ఉద్యోగులను కలసి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: ప్రజారంజక పాలన, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో మాజీ సీఎం చంద్రబాబు చరిత్ర ముగిసిందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం ఆమె స్థానిక భజన మందిరంలో పట్టభద్రులతో సమావేశమై తమ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. సీఎం జగనన్న పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో గెలవలేమని తెలిసినా.. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు చూపే పచ్చ మీడియా సహాయంతో టీడీపీ మరిన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని జనాల ముందుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందన్నారు. నారా లోకేశ్ పాదయాత్ర చేస్తున్న విషయం కూడా ప్రజలకు తెలియడం లేదని, ఆయన పాదయాత్రలో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు, సెక్యూరిటీ వారే తప్ప ప్రజలెవ్వరూ కానరావడం లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు గెలవలేరనే డమ్మీ అభ్యర్థులను పోటీలో నిలిపారన్నారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు బొమ్మన రవిరెడ్డి, వెంకట్‌నాయుడు, జడ్పీటీసీ సుంకన్న, బొమ్మన పెద్దిరెడ్డి, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రరెడ్డిని గెలిపించండి

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పట్టభద్రులను కోరారు. ఈ నెల 13న జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు.


పత్తికొండటౌన్: అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ మాధురితో పాటు, అధ్యాపకులను కలసి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. ఆ తర్వాత సచివాలయ ఉద్యోగులను కలసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఎంపీపీ నారాయణదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ

నందవరం: వేసవిలో పల్లెల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్, విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తోందని ఏఈ రవీంద్ర వివరించారు. రబీలో సాగుచేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని ఏఓ మద్రి స్రవంతి సూచించారు. ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కచ్చితమైన కొలతల మేరకు పనులు చేస్తే రోజుకు రూ.257 కూలి పొందవచ్చని ఈసీ నూర్జహాన్ చెప్పారు. ప్రభుత్వ బడుల్లో నాడు–నేడు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి వివరించారు. ఫ్యామిలీ ఫిజిషియన్ విధానంతో గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్య లత పేర్కొన్నారు. మండలాభివృద్ధికి ప్రతి అధికారి కృషి చేయాలని, అందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ కోరారు. వైస్ ఎంపీపీలు మద్రి అగ్నేశమ్మ, షేక్‌సాహెబ్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు కృషి


వెల్దుర్తి బీసీ బాలికల హాస్టల్ విద్యార్థినులకు సూచనలిస్తున్న ఏడీ శామ్యూల్ పాల్

వెల్దుర్తి: పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా జిల్లా కలెక్టర్, విద్యాశాఖ నైట్‌విజన్ కార్యక్రమాన్ని రూపొందించిందని విద్యాశాఖ కార్యాలయం కర్నూలు ఏడీ శామ్యూల్ పాల్ అన్నారు. గురువారం రాత్రి ఆయన వెల్దుర్తి ఎస్సీ బాలుర హాస్టల్, బీసీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల రీడింగ్ క్లాస్‌లను పరిశీలించారు. పరీక్షల కొరకు ప్రిపేర్ అవుతున్న విధానాన్ని పరిశీలించి విద్యార్థులకు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసే బాధ్యత హాస్టల్ వార్డెన్లదేనన్నారు. ఆయా హాస్టళ్లలో సౌకర్యాలు, బోధన పద్ధతులు, చదివించే విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు.

వ్యవసాయ అవసరాలకు మూడు డ్రోన్లు


హొళగుందలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

హొళగుంద: వ్యవసాయ పనుల నిమిత్తం మండలానికి మూడు డ్రోన్లు మంజూరయ్యాయని, ఆసక్తి ఉన్న వారు ఆర్బీకేలో దరఖాస్తు చేసుకుని సబ్సిడీ కింద వాటిని పొందవచ్చని ఏఓ నరేంద్రకుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండడంతో గంట వ్యవధిలోనే సమావేశం ముగించారు. ఎంపీడీఓ దాసానాయక్ మాట్లాడుతూ ఆయ గ్రామాలలో ఇంటి, కుళాయి పన్నుల వసూళ్లను వంద శాతం పూర్తి చేయాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈఓ ఈరన్న మాట్లాడుతూ.. 25 పాఠశాలలో నాడు–నేడు పనులు చురుగ్గా సాగుతున్నాయని వివరించారు. వైద్యాధికారి న్యూటన్ మాట్లాడారు. చాలకాలంగా గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కోసం అడుగుతున్నా పట్టించుకోవడం లేదని పెద్దగోనెహాళ్ సర్పంచ్ కొత్తింటి వెంకటరెడ్డి తెలపగా త్వరలోనే పరిష్కరిస్తామని ఏఈ ఓబుళమ్మ హామీఇచ్చారు. గజ్జహళ్లిలో పనికి ఆలస్యంగా వచ్చారని 120 మంది కూలీలను ఉపాధి సిబ్బంది ఇంటికి పంపించారని దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కెంచప్ప ఉపాధి ఈసీ సూర్యప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆయన సమాధానమిచ్చాడు. జెడ్పీ వైస్ చైర్మన్ కురువ బుజ్జమ్మ, వైస్ ఎంపీపీ గాదెమ్మ, ఎంపీడీఓ దాసానాయక్, తహసీల్దారు హుసేన్‌సాహెబ్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు


ఆలూరు ప్రభుత్వ బాలుర–2 పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ మోహన్‌దాస్

ఆలూరు రూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పత్తికొండ ఆర్డీఓ మోహన్‌దాస్ అన్నారు. ఆయన గురువారం ఆలూరు ప్రభుత్వ బాలుర–2 పాఠశాల, హాలహర్వి జెడ్పీ పాఠశాల, ఆస్పరిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. పత్తికొండ డివిజన్‌లోని 9 మండలాల్లో రెండు పోలింగ్ బూతుల చొప్పున సిద్ధం చేస్తున్నామన్నారు. పత్తికొండ డివిజన్‌లో 9,385 మంది పట్టభద్ర ఓటర్లు, 430 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారన్నారు. వీరందరికీ ఈ నెల7వ తేదీలోగా ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తామని చెప్పారు. అలాగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఓటు వేసేందుకు డివిజన్‌లో 9 మంది జెడ్పీటీసీలు, 136 మంది ఎంపీటీసీలు ఉన్నారని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పీఓ, ఏపీఓతో పాటు ఒక సహాయకుడిని నియమించామన్నారు. తహసీల్దార్ మల్లికార్జున, డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ బసవన్న గౌడ్ తదితరులు ఉన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆర్డీఓ మోహన్‌దాస్ విద్యార్థులతో అన్నారు. స్థానిక బాలుర–2 పాఠశాలలో ఎంఈఓ కోమలాదేవితో కలిసి విద్యార్థులతో మాట్లాడారు. పక్కా ప్రణాళికతో చదివి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలి

నందవరం: పాడి రైతులు పశు పోషణలో జాగ్రత్తలు పాటించాలని నందవరం పశు సంవర్ధక శాఖ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని గంగవరం, జొహరాపురం గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ పశు పోషణలో జాగ్రత్తలు పాటించి, వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. రెండు గ్రామాల్లో 450 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. పాడి రైతులు పశువుల ఎదను సకాలంలో గుర్తించి, ఎద సూదులను వేసుకోవాలని సూచించారు. ప్రతి పశువుకు బీమా చేయించుకోవాలన్నారు. సచివాలయ పశు సహాయకులు, గోపాల మిత్ర సభ్యుడు నల్లారెడ్డి పాల్గొన్నారు.

శనగకు మద్దతు ధర

తుగ్గలి: శనగ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ పవన్‌కుమార్ సూచించారు. గురువారం రాతన ఆర్‌బీకేలో శనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. క్వింటాల్ శనగ రూ.5,330 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులు కొనుగోలు కేంద్రాల్లో శనగ విక్రయించవచ్చన్నారు. రబీలో మండల వ్యాప్తంగా 1,943 ఎకరాల్లో శనగ సాగైనట్లు తెలిపారు. కేడీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో మల్లికార్జున అనే వ్యక్తి గురువారం అనారోగ్యంతో మరణించాడు. ఆయన పేరిట వైఎస్సార్ బీమా నామినీగా ఉన్న భార్య కురువ లక్ష్మికి సర్పంచ్ కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో తక్షణ సాయం రూ. 10 వేలు నగదును సచివాలయ ఉద్యోగులు అందజేశారు. మిగతా బీమా సొమ్ము త్వరలో బాధితురాలి బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని ఆమె తెలిపారు.

సకాలంలో వడ్డీ చెల్లించాలి

ఆస్పరి: స్థానిక సొసైటీలో రుణాలకు సంబంధించిన వడ్డీ సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన రైతులను కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా పంట రుణాలు, రైతన్న నేస్తం, రాజన్న చేయూత, యల్‌టీ లోన్‌కు సంబంధించి వడ్డీలను ఈ నెలాఖరులోపు చెల్లించాలన్నారు. సొసైటీ సీఈఓ అశోక్, డైరెక్టర్ రంగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోండి

ఆస్పరి: రబీ సీజన్‌లో శనగ సాగుచేసిన రైతులు పంట దిగుబడులను ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ మునెమ్మ సూచించారు. ఆస్పరిలో గురువారం ఏఓ మాట్లాడుతూ.. మండలంలోని ఆస్పరి, చిన్నహోతూరు, జొహరాపురం గ్రామాలలో మాత్రమే రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకన్న రెండు రోజులకు శనగల తూకాలు మొదలు పెడతామన్నారు. మండలంలోని మిగతా గ్రామాల్లో త్వరలోనే రిజిస్ట్రేషన్ చేపడుతామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కృష్ణగిరి: కంబాలపాడు వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి సమీపంలో అక్రమంగా కర్ణాటక మద్యం కలిగిఉన్న బోయ రామచంద్రుడును గురువారం అరెస్టు చేసినట్లు 25 విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు.

జాతీయస్థాయికి ఎంపిక

ఆలూరు రూరల్: హత్తిబెళగల్ జెడ్పీ పాఠశాల 7వ తరగతి విద్యార్థి రియాజ్ జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుధాకర్ తెలిపారు. రియాజ్ గత నెల 20, 21 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు.

ఎస్సీ జాబితాలో చేర్చాలి

ఆలూరు: ఆర్థిక, సామాజిక రంగాలలో వెనకబడిన రజక కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర రజక కులస్తుల సంఘం అధ్యక్షుడు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆలూరులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో రజక ఐక్య సేవా సమితి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు.

సమయపాలన తప్పనిసరి

మద్దికెర: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ నరసింహమూర్తి హెచ్చరించారు. ఆయన గురువారం బసినేపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

బాల్య వివాహాలు నివారించాలి

నందవరం: బాల్య వివాహాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యురాలు సౌజన్యలత సూచించారు. గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాల్య వివాహాల నివారణ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వెల్దుర్తి: బాలికల ఆరోగ్యం, చదువు, నేరాలపై ఉలిందకొండ పీహెచ్‌సీ అధికారులు గురువారం స్థానిక కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎంపీహెచ్‌ఈఓ సుబ్బరాయుడు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు.

లింగ వివక్ష నేరం

మద్దికెర: మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పోటీ పడుతూ రాణిస్తున్నారని, లింగ వివక్ష చూపడం నేరమని ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గురువారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులచే ర్యాలీ నిర్వహించారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టండి

కృష్ణగిరి: గ్రామాల్లో అందరూ ఐకమత్యంగా ఉండి అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. రామకృష్ణాపురంలో గురువారం రాత్రి ఆయన గ్రామసభ నిర్వహించి రహదారి ప్రమాదాలు, బాలికా చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ తమ పిల్లలను చదివించుకోవాలని సూచించారు. సమస్యలపై పంతాలు, పట్టింపులకు పోకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

అద్వైత ఆణిముత్యం

కృష్ణగిరి: పుట్లూరు గ్రామానికి చెందిన పూజారి సీవీ అభిలాష్ తిరుపతిలోని జాతీయ సాంస్కృతిక విద్యాలయంలో విశిష్ట అద్వైత వేదాంతంలో ఎంఏ పూర్తి చేశారు. గ్రామానికి చెందిన పూజారి శ్రీనివాసులు, లక్ష్మీదేవి దంపతుల కుమారుడైన అభిలాష్ గురువారం తిరుపతి మహతి ఆడిటోరియంలో విద్యాలయ చాన్స్‌లర్ గోపాల కృష్ణమూర్తి, వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి, గురువు రాఘవన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు.

రమణీయం.. రథోత్సవం


పెద్దహోతూరులో అశేష భక్తజనం నడుమ రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆలూరు రూరల్: పెద్దహోతూరు గ్రామంలో కొలువైన హుచ్చు వీరప్ప, మరకట్టు గ్రామంలోని సలువప్ప తాతల రథోత్సవం గురువారం రమణీయంగా జరిగింది. భక్తులు భారీగా తరలివచ్చి రథంపై ఉన్న కలశానికి ఫలాలను విసిరి మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా పెద్దహోతూరు గ్రామం జనసంద్రంగా మారింది. మరకట్టు గ్రామంలో కొలువైన సలువప్ప తాత ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు గ్రామస్తుల నడుమ వేదమంత్రోచ్ఛరణలతో పెద్దహోతూరు గ్రామానికి చేర్చారు. సాయంత్రం హుచ్చు వీరప్ప, సలువప్ప ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేసి రథంపై చేర్చారు. అశేష భక్తజనం నడుమ రథాన్ని ఎదురు బసవన్న ఆలయం వరకు లాగారు. పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు చంద్రమౌళి ఆధ్వర్యంలో కుంకుమార్చన, జలాభిషేకం, మహామంగళ హారతి, గంగి పూజ తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు కమిటీ నిర్వాహకులు అన్న ప్రసాదాలు పంచి పెట్టారు. ఉత్సవం సందర్భంగా గ్రామానికి వచ్చే భక్తుల కోసం ఆటోల్లో ఉచిత రవాణా సౌకర్యంతో పాటు ఆలూరు జూనియర్ కళాశాల సమీపంలో మజ్జిగ, మంచి నీళ్లను పంపిణీ చేశారు. ఆలూరు సీఐ ఈశ్వరయ్య నేతృత్వంలో ఎస్‌ఐ నాయక్ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.